ప్రతిభా పురస్కారాల ప్రదానం వాయిదా

కాచిగూడ: మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో అందజేయనున్న మున్నూరుకాపు విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ విద్యార్థులకు అందించే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి



వినతి పత్రం ఇస్తున్న వెంకటేశ్వర్

కాచిగూడ: అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ–డీ' నుంచి బీసీ–ఏలోకి మార్చాలని అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్‌ల సమస్యను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అసంపూర్తి పనులతో ప్రజలకు ఇబ్బందులు



పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేటర్ చెప్పల్‌బజార్ ప్రాంతంలో అసంపూర్తిగా ఆగిపోయిన వర్షపు నీటి పైపులైన్ పనులను పర్యవేక్షించి మాట్లాడారు. చెప్పల్‌బజార్‌లో వర్షపునీటి పైపులైన్ పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా పూర్తి చేయకుండా అర్ధంతరంగా వదిలేయడంతో పాదచారులు, వాహనదారులు నానా ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని స్థానిక ప్రజలకు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కార్పొరేటర్ వెంట కన్నె రమేష్ యాదవ్, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, రాజ్‌కుమార్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, లక్ష్మణ్ ఉన్నారు.

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు



అబ్దుల్ గఫార్

చిక్కడపల్లి: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించినట్లు దోమలగూడ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం.. హిమాయత్ నగర్ స్ట్రీట్ నంబర్–3లో అబ్దుల్‌గఫార్ (28) ఈ నెల 14న రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సికింద్రాబాద్ 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పర్చగా నాలుగు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న దుంగల పట్టివేత



అంబర్‌పేట: మూసీ నదిలోని చెట్లను నరుకుతున్న వ్యక్తులను మంగళవారం అధికారులు అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. మూసీ ఒడ్డున చెట్లు నరికినా, ఆక్రమణలకు పాల్పడినా తగిన చర్యలు తీసుకుంటామని అంబర్‌పేట తహసీల్దార్ భిక్షపతి హెచ్చరించారు.

అవార్డు ప్రదానం



శ్రీధర్

నల్లకుంట: హైదరాబాద్‌కు చెందిన అనుకార్ ఫార్మసీ ఎండీ అరుగొండ శ్రీధర్, సౌత్ ఇండియా–2 టాప్ కెమిస్ట్ ఆఫ్ ద ఇయర్–2023 అవార్డుకు ఎన్నికయ్యారు. సోమవారం ఢిల్లీలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో అబ్బాట్ న్యూట్రీషినల్ నేషనల్ హెడ్ నీల్ ఝూర్జీ చేతుల మీదుగా శ్రీధర్ అవార్డు అందుకున్నారు.



శీతాకాలం.. వ్యాధుల భయం!

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు, కమ్ముకుంటున్న మంచు తెరలు
- 'ఫీవర్'కు పెరుగుతున్న రోగుల తాకిడి
- నిర్లక్ష్యం చేస్తే చిన్నారుల్లో న్యూమోనియా
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

నల్లకుంట: శీతాకాలం ప్రారంభం అయిందంటే చాలు.. వివిధ రకాల రోగాలు విజృంభిస్తుంటాయి. ఇటీవల విపరీతంగా పెరిగిన చలితో జనాలు జలుబు, దగ్గు తదితర వాటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్న సమయంలోనూ చలి తగ్గడం లేదు. చలికాలం మొత్తం అత్యంత జాగ్రత్తలు పాటించాలని కొద్దిపాటి నిర్లక్ష్యం చేసినా ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దేశంలో ఓ వైపు నమోదవుతున్న కోవిడ్ కొత్త వేరియంట్ భయపెడుతుండగా మరో వైపు సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. వాతావరణంలో మార్పులతో పెద్దలు సాధారణ జ్వరాలు దగ్గు, చిన్నారులు జ్వరం, దగ్గు, జలుబుతో ఉబ్బసం బారిన పడుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి.. చలి పెరుగుతోంది. ఉదయం ఏడున్నరైనా మంచు తెర పోవడం లేదు. భానుడి వెలుగులు కానరావడం లేదు. అంబర్‌పేట నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి రొంప, దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో రోగుల తాకిడి పెరుగుతోంది. జలుబు, దగ్గు, జ్వరంలో నిత్యం 300– 400 మంది వరకు ఫీవర్ ఆస్పత్రికి వస్తున్నారు.

చిన్నారుల్లో న్యూమోనియా వచ్చే ప్రమాదం..

పిల్లలకు చల్లని గాలి తగిలిన వెంటనే న్యూమోకోకల్ వైరస్ వారి శరీరంలో ప్రవేశించి న్యూమోనియా వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఉబ్బసం వ్యాధి అధికంగా వస్తుంది. వ్యాధి ప్రభావంతో ఊపిరితిత్తులకు ప్రాణ వాయువు సరఫరా సరైన రీతిలో సాగదు. ఫలితంగా తీవ్రమైన దగ్గు, ముక్కు కారడం, అధిక జ్వరం వస్తుంది. సకాలంలో చికిత్సలు చేయించకపోతే ఉబ్బసం వ్యాధికి దారి తీస్తుంది. వ్యాధి తీవ్రమయ్యే కొద్ది చర్మం నీలం రంగులోకిమారి మెదడుకు ఆక్సిజన్ అందక మూర్ఛ వచ్చే ప్రమాదం కూడా ఉంది.పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దల్లో ఆస్తమా వ్యాధి వృద్ధి చెందుతుంది. ఈ వ్యాధిగ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్యతో అధికంగా బాధ పడుతుంటారు. జ్వరం 102 డిగ్రీలకు చేరడం, కోరింత దగ్గు, ముక్కు నుంచి నీరు కారడం వంటివి వ్యాధి లక్షణాలు. 40 ఏళ్ల వయసు పై బడిన వారిలో ఈ లక్షణాలు అధికంగా కనబడతాయి.

చర్మ వ్యాధులు..

శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. విటమిన్ 'డీ' లోపంతో చర్మంపై దద్దుర్లు, చర్మం పగుళ్లు రావడం జరుగుతోంది. అందుకే చలికాలంలో బయట తిరిగేటప్పుడు చర్మంపై దుమ్ము, ధూళి పడకుండా తప్పని సరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

నివారణ ఇలా ..

చిన్న పిల్లలను చలిలో బయట తిరగకుండా చూడాలి. వెచ్చని దుస్తులు(ఉన్ని దుస్తులు) ధరింపచేయాలి. ఇంట్లో వెచ్చగా ఉండేలా హీటర్లు వినియోగించాలి. పిల్లలు నిద్రించే ప్రదేశంలోకి చల్లని గాలి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి బారిన పడిన చిన్నారులకు సరైన వైద్య చికిత్సలు అందిస్తే మూడు నుంచి వారం రోజుల్లో కోలుకుంటారు. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. దీంతో ఊపిరితిత్తుల్లో గాలి ప్రసరణ బాగా జరుగుతుంది. వ్యాయామం, నడకతో శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.



ఫీవర్‌లో ఇన్ పేషంట్లుగా జ్వర పీడితులు

వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి



చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో శీతాకాలంలో త్వరగా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలకు తల్లిపాలు అందించడం శ్రేష్టమైనది. వాటితో పాటు పౌష్టికాహారాన్ని అందించాలి. పిల్లలకు అనారోగ్యంగా ఉన్నప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లడంతో శీతాకాలంలో వచ్చే న్యూమోనియా తదితర వ్యాధులను నివారించవచ్చు.

–డాక్టర్ శంకర్, ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్

రైతు ఉద్యమాలను ఉద్ధృతం చేయాలి



మాట్లాడుతున్న విజ్జుకృష్ణన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో రైతు ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయాల్సిన అవసరం ఉందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో విజ్జుకృష్ణన్ పాల్గొని మాట్లాడారు. రైతు సమస్యలపై పోరాటంలో కలిసి వచ్చే రైతులను చైతన్యం కల్పించాలన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని, విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో తక్కువ ధరకు ఇవ్వాలని, పంట నష్టం జరిగితే బీమా కంపెనీల ద్వారా నష్టపరిహారం చెల్లించాలని అయితే బీజేపీ ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం విచారకరమన్నారు. వలస కార్మికుల ఆత్మహత్యలు కూడా పెరిగిపోయాయన్నారు. యువకులు, నిరుద్యోగులు 50 వేలకు పైగా ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ప్రపంచంలో ఇలాంటి ఆత్మహత్యలు ఎక్కడ జరగలేదని విమర్శించారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతు సమస్యలపై స్పందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి జి.సాగర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ అరబండి ప్రసాదరావు, బొంతల చంద్రారెడ్డి, మూడ్ శోభన్ నాయక్, మాదినేని రమేష్, వీరపల్లి వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల పాల్గొన్నారు.

దేశ సంస్కృతి ప్రపంచానికే తలమానికం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికే తలమానికం అని బీఈఎల్ బెంగళూర్ డైరెక్టర్ కైపా వెంకట సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ప్రముఖ కళాకారుడు డాక్టర్ పిళ్లుట్ల లక్ష్మీకాంత్‌శర్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన పాండవ రాజసూయం పౌరానిక పద్యనాటకం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. కుమారి కీర్తన బత్తుల, లక్ష్మి ప్రసన్న, జాహ్నవి, జేష్మా ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కేఎస్‌పీ తన్నాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్, నిఖిల్‌కుమార్ జైన్, గుమ్మడి గోపాలకృష్ణ, సినీ నటుడు కోట శంకర్‌రావు, నంద్యాల వేణుమనోహర్‌రెడ్డి, డాక్టర్ కె.ఎస్.రావు, లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.



లక్ష్మీకాంత్‌శర్మను సత్కరిస్తున్న దృశ్యం

మెజీషియన్‌కు సత్కారం

చిక్కడపల్లి: పిల్లలు, యువత, పెద్దల్లో మ్యాజిక్ నేర్చుకోవడంతో మానసిక వికాసం పట్టుదల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రముఖ మెజీషియన్ శ్రీలంక మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు రోహన్ జయశేఖర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నేర్పించేందుకు కృషి చేస్తామన్నారు. నగరానికి విచ్చేసిన ఆయనను మంగళవారం ఇండియన్ సివిల్ సొసైటీ అధ్యక్షుడు కొల్లినాగేశ్వర్‌రావు, జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (జాట్) నగర అధ్యక్షుడు చిలుకూరి అఖిలేష్, ప్రముఖ జర్నలిస్ట్ వై.సురేష్‌బాబు, హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు విజయ్‌కాంత్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అభినందనలు



చిక్కడపల్లి: బీసీ, రవాణా శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జరపటి సత్యనారాయణ రాజు, వైస్ చైర్మన్ ఎత్తిరి అంతయ్య మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

23న ఉత్తర ద్వారం దర్శనం

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో 23న ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం దర్శనం ఉంటుదని అలయ ఈవో దేవనాథ, పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ బాసాని పద్మ తెలిపారు. ఈ సందర్భంగా విష్ణుసహస్రనామ పారాయణం కూడా ఉంటుందన్నారు.

చర్చల చంద్రన్న కృషి మరువలేనిది



నివాళులు అర్పిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పీడిత ప్రజల విముక్తి కోసం చర్చల చంద్రన్న చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఉద్యమ మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన చంద్రన్న వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం చంద్రన్న చేసిన పోరాటాలను ముందు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. చర్చల చంద్రన్న ప్రజా ఉద్యమాల సారధిగా లాల్ నీల్ విప్లవ సేనానిగా శాంతి చర్చల ప్రతినిధిగా మంచి గుర్తింపును తెచ్చుకున్నారని కొనియాడారు. సాధారణ కుటుంబంలో జన్మించిన చంద్రన్న ఎందరో హృదయాలు గెలుచుకున్నారన్నారు. ప్రొఫెసర్ తిరుపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి ప్రదీప్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్దన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్.యాదగిరి పాల్గొన్నారు.

రమేష్‌బాబుకు ఎక్సలెన్సీ అవార్డు



కాచిగూడ: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జరిగే కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గణిత శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబుకు శ్రీనివాస రామానుజన్ ఎక్సలెన్సీ అవార్డు అందజేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, కార్యదర్శి డాక్టర్ మొహమ్మద్ అక్తర్ అలీ తెలిపారు. డాక్టర్ కె.రమేష్ బాబు గత 25 ఏళ్లుగా గణితశాస్త్రంలో ఎనలేని కృషి చేస్తున్నారని, గణిత శాస్త్రంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో ప్రసంగం, పరిశోధనలు జరిపి ఎంతో పేరు సంపాదించారన్నారు.

'ఫ్రీ బస్సు'తో ఆటో కార్మికులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న వేముల మారయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోవాల్సి వచ్చిందని ఈ పథకం వారికి ఉరి తాడులా మారిందని బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్ విమర్శించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఆటో మోటర్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికుల సమస్యలపై దృష్టి సారించి వారికి ప్రతి నెల రూ.10 వేల జీవనోపాధి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరంతర ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ఆటో మోటర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ నెల 27న అన్ని జిల్లా కలెక్టర్లకు మెమోరాండం ఇస్తామని జనవరి 7వ తేదీన ఇందిరాపార్కు వద్ద ఆటో కార్మికుల మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో రూప్‌సింగ్, నారాయణ, శ్రీనివాస్, రాజేందర్, నయీం, వాజిద్, నిరంజన్, బాలన ర్సింహా పాల్గొన్నారు.

సన్మానం



కవాడిగూడ: చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని మంగళవారం మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... అసెంబ్లీలో దళితుల పక్షాన గొంతు విప్పాలని కోరినట్లు తెలిపారు. దళితులకు కాంగ్రెస్ పార్టీలోనే ప్రాధాన్యం లభిస్తుందని ఎంతో రాజకీయ అనుభవం ఉన్న వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహా, పవన్, సాయిచంద్, నరేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీతయ్య

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ట్రేస్ చేసిన పోలీసులు వారికి అందజేశారు. మంగళవారం ఏడుగురికి ఇన్‌స్పెక్టర్ సీతయ్య ఫోన్లు అందజేశారు. ఫోన్లను ట్రేస్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

మా పార్క్‌ను పట్టించుకోండి!



గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని అశోక్‌నగర్ పార్క్-2 అభివృద్ధి పనులు గత నాలుగు నెలల క్రితం ప్రారంభించి వదిలివేయడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్కులు పచ్చదనం ఆహ్లాదాన్ని అందాల్సి ఉండగా ఈ పార్క్ మాత్రం అధ్వానంగా మారింది. గతేడాది నుంచి పార్క్ అభివృద్ధి చేస్తామని పార్క్ ప్రహరీలు పగలకొట్టి బోరింగ్ వేసి వదిలివేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సాకుతో దాదాపు ఏడాది గడిచిపోయినా పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లో ప్రహరీలు లేకపోవడంతో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని కొందరు వ్యర్థాలు పారబోస్తుండటంతో అపరిశుభ్రంగా మారుతుందని వాపోతున్నారు. పార్కులో ఉన్న ఉయ్యాలలు, మేరిగో, ఆటవస్తువులు ధ్వంసమయ్యాయి. అంతేకాక రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్కు పరిస్థితి అధ్వానంగా మారుతున్నా అధికారులు గానీ.. ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. -చిక్కడపల్లి

